సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం । 8 । మార్చి । 2024

ఆడపిల్లకు అందలం

- ఆటు పోట్లు ఎదురైనా లక్ష్యాన్ని సాధిస్తాం
- మళ్లీ జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుడుతాం
- కష్టసుఖాల్లో అండగా నిలిచేందుకు కృషి చేస్తాం
- 'సాక్షి' ప్రత్యేక సర్వేలో పలువురు మహిళల అభిమతం


అన్నింటా ముందు వరుసలో ఉంటున్నాం.. విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం ఇలా అన్నిరంగాల్లో రాణిస్తున్నాం. ఇంటా, బయటా అనేక ఆటు పోట్లు ఎదుర్కొంటూ.. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న ఏకైక లక్ష్యంతో.. ముందుకు సాగుతూ.. తోటి వారికి చేయూతనందిస్తామని చెబుతున్నారు పలువురు మహిళామణులు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన సర్వేలో పలువురు మహిళలు తమ అభిప్రాయాలను వెల్లడించారు ఇలా..

తీసుకున్న శాంపిల్స్ **300** మంది


సేకరించిన ప్రాంతాలు : మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట

తీసుకున్న వర్గాలు : డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ఉద్యోగులు


1. మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా?




2. మహిళగా మీరు ఎక్కువగా ఇబ్బందిపడిన అంశం



3. మీకే పూర్తి అధికారం ఉంటే.. మహిళల కోసం ఏం చేస్తారు?



4. మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటారు



అణచివేతను అరికట్టాలి

- బాల్యవివాహాలు, వరకట్నం, గృహహింస వంటివి కట్టడి చేయాలి
- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' చర్చావేదికకు విశేష స్పందన
- మహిళల హక్కులు, స్వేచ్ఛపై అభిప్రాయాలు వెల్లడించిన విద్యార్థులు

నేటి ఆధునిక సమాజంలో కూడా మహిళలపై గృహహింస, వరకట్నం కోసం వేధింపులు, మహిళల అక్రమ రవాణా వంటివి జరుగుతున్నాయి. మహిళల హక్కులను కాలరాస్తూ.. అణచివేతకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ప్రతి మహిళ పూర్తిస్థాయిలో హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. షీటీంలను మరింత పటిష్టం చేసి మహిళలకు భద్రత కల్పించాలి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిర్మూలించాలంటే చట్టాలను మరింత కఠినతరం చేసి.. అణచివేతను అరికట్టాలని పలువురు విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 'సాక్షి' నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా.. - మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్



సాక్షి చర్చావేదికలో పాల్గొన్న ఎంవీఎస్ కళాశాల విద్యార్థులు

రేపటికి ముందడుగు

మిస్సింగ్స్‌పై స్పందించాలి



ఈ మధ్యకాలంలో చాలామంది బాలికలు మిస్సింగ్ అంటూ పేపర్లలో కథనాలు వస్తున్నాయి. మిస్సింగ్‌లపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది. ఇంటి వద్ద పరిస్థితులు, ఇతర కారణాలతో బాలికలు ఇంటి నుంచి వెళ్లిపోవడం జరిగే వాటిని సమాజం చాలా తేలిగ్గా తీసుకుంటుంది. వీటిని అరికట్టేందుకు కృషి చేయాలి. - అరుణ, ఏవీసీఎస్

పశ్చాత్తాపం కనిపిస్తలేదు



నేటికాలంలో ఎంతోమంది బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అలా జరిగిందని తేలితే వారికి వెంటనే ఉరి తీసే విధంగా చట్టం తీసుకురావాలి. వారి సుఖం కోసం బాలికలను బలి చేస్తున్నారు. వారిని ఏళ్ల తరబడి జైళ్లలో పెట్టి మేపడం వల్ల తప్పు చేశామన్న పశ్చాతాపం కూడా లేకుండాపోతుంది. ఉరి తీసేందుకు చట్టం తీసుకురావాలి. - అనిత, ఎంవీఎస్

స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలి..



నేటి సమాజంలో చాలామంది బాలికలకు పెళ్లి విషయంలో పూర్తి నిర్ణయం తల్లిదండ్రులకే వదిలేస్తున్నారు. దీని వల్ల తెలిసీ తెలియని వయసులో వివాహాలు చేసుకుని బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి బాలిక కూడా కచ్చితంగా ఉద్యోగం చేసి స్థిరపడిన తర్వాత మాత్రమే పెళ్లి చేసుకోవాలి. భర్తపై ఆధారపడకుండా ప్రతి విషయంలో స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలి. - శిరీష, ఎంవీసీ

మార్పు రావడం లేదు..



వరకట్నం నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చిన ఇప్పటికీ మార్పు రావడం లేదు. తల్లిదండ్రులు అనేక కష్టాలు పడి కట్నం ఇవ్వాల్సి వస్తుంది. కట్నం అడిగిన వారిని శిక్షించాలి. - అయేషా బూటల్, ఎంవీసీఎస్

చులకనభావం మానుకోవాలి..



ఆడపిల్ల అంటేనే ఒక చులకనభావం కలిగి ఉంది. పాఠశా**లకు వెళ్లే స్థాయిలో**నే పెళ్లి చేయడం వరకు ప్రతి అంశం**లోనూ చులకనగా** చూస్తున్నారు. ఎన్‌సీసీ చేయడం వల్ల **ఆలస్యంగా ఇంటికి** వెళ్తే ఇంటి పక్కన వారు కూడా చుల**కనగా మాట్లాడతా**రు. ప్రోత్సహించకపోయినా చులక**నగా చూడొద్దు.** - శ్రుతి, ఎంఎస్‌సీఎస్

మనోధైర్యంతో ముందుకెళ్లాలి



అన్ని రంగాల్లో మహిళలు మనోధైర్యంతో ముందుకెళ్లాలి.. ప్రత్యేకమైన మహిళా శక్తిగా నిలబడాలి.. మారుతున్న కాలనుగుణంగా ప్రజల్లో మార్పు తీసుకువచ్చేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రజల్లో, కుటుంబ సభ్యుల్లో మార్పు రావాలి. అమ్మాయి.. అబ్బాయి అనే తేడా లేకుండా పిల్లలను పెంచాలి. ఇంటి నుంచి.. తల్లిదండ్రుల నుంచి ఈ మార్పు మొదట రావాలి అని ఎస్పీ రితిరాజ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు. ఆడపిల్లలంటే తక్కువ.. మగ పిల్లలు అంటే ఎక్కువ అనే ధోరణి సమాజంలో నేటికీ ఉంది. ఇలాంటి ధోరణి మన తల్లిదండ్రులే బీజం వేస్తారు. ఇది మారాలి. నా బ్యాలంలో ఎక్కడా కుడా మా కుటుంబ సభ్యులు చులకన భావన లేకుండా అందరూ సమానమే అని పెంచారు. ఒకరు ఎక్కువ.. మరొకరు తక్కువ అని కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించారు. మానవ బంధాలను, సంబంధాలను కలుపుతూ మాతృమూర్తిగా, స్త్రీగా మాత్రమే చూసే ధోరణి నుంచి కూడా బయట పడాలి. పాఠశాలల వద్ద.. కళాశాల వద్ద.. బస్టాండ్‌ల వద్ద ఇలా ఎన్నో చోట్ల అమ్మాయిలు వేధింపులకు గురవుతున్నారు. ఎన్నో సుడిగుండాలను దాటుకుంటూ జీవన పోరాటం చేయాల్సిన పరిస్థితి. జిల్లాలో మహిళ చట్టలపై ప్రత్యేక అవగహన సదస్సులు నిర్వహిస్తున్నాం. షీ టీం బృందాలు మహిళల సమస్యలపై చర్యలు తీసుకుంటున్నాం. మైనర్లపై వేధింపులు కలచివేస్తున్నాయి. నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకున్నాం. ఇలాంటి సంఘటనలు పునరవృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుని శాంతిభద్రతలపై దృష్టి సారించి ముందకెళ్లడమే ప్రస్తుతం ఉన్న లక్ష్యం. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి అని ఎస్పీ అన్నారు. - రితిరాజ్, ఎస్పీ

అన్నిచోట్ల ఇబ్బందులే..

బాలికలకు ఎక్కడ ఉన్న ఇబ్బందులు తప్పడం లేదు. వనపర్తి నుంచి వచ్చి ఎస్టీ హాస్టల్స్‌లో ఉంటున్నాం. రాత్రి 12 గంటల వరకు హాస్టల్ ముందు ఉన్న రోడ్డు మీద అబ్బాయిలు తాగుతూ.. తిరుగుతూ.. అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక్కడే పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. - లలిత, ఎంవీసీ

ఆర్థిక స్వాతంత్ర్యం..

- ఫైనాన్షియల్ ఫ్రీడంతోనే మహిళలకు అన్నింటా గౌరవం
- పట్టుదల సడలనివ్వకుండా గోల్ సాధించాలి
- అప్పుడే వందశాతం వివక్ష లేని సమాజం ఉద్భవిస్తుంది
- వనపర్తి ఎస్పీ రక్షిత కె.మూర్తి
- పత్రికల నిర్వహణ కష్టతరమైన బాధ్యత

సాక్షి గెస్ట్ ఎడిటర్

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: 'ఆధునిక సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు ఇంటా బయట అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయి. గతంతో పోలిస్తే మహిళలపై వివక్ష కొంత మేర తగ్గింది. అయినా కొన్ని చోట్ల ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రతి ఒక్క మహిళ విద్యనభ్యసించి.. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించినప్పుడే వివక్షకు పూర్తి స్థాయిలో చరమగీతం పాడొచ్చు' అని వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి ఆకాంక్షించారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఆహ్వానం మేరకు గురువారం యూనిట్ కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా ఒకరోజు విధులు నిర్వర్తించారు. మహిళలకు సంబంధించిన ప్రత్యేక కథనాలపై ఎడిటోరియల్ సిబ్బందితో చర్చించారు. మహిళల్లో స్ఫూర్తి నింపి.. చైతన్యం కలిగించే వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పలు కథనాలను పరిశీలించి.. చాలా కసరత్తు చేశారంటూ తగిన శీర్షికలను సూచించారు. అంతే కాదు వార్తల ప్రాధాన్యత, ఎడిటింగ్, పేజీనేషన్‌ను స్వయంగా పరిశీలించి.. పలు మార్పులు చేశారు. వందకు వంద శాతం మహిళల పట్ల వివక్ష లేని సమాజం ఉద్భవించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఎడిటోరియల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న వనపర్తి ఎస్పీ రక్షిత కె.మూర్తి

ప్రత్యేక అనుభూతి..

గెస్ట్ ఎడిటర్‌గా ఒకరోజు విధులు నిర్వర్తించిన ఎస్పీ రక్షిత కె మూర్తి యూనిట్ కార్యాలయంలో కలియ తిరుగుతూ అన్ని విభాగాలను సందర్శించారు. ఎడిటోరియల్, ఐటీ, యాడ్స్, సర్క్యులేషన్, సీటీపీతో పాటు ప్రింటింగ్ విభాగాలను పరిశీలించారు. టెక్నికల్ అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. పత్రికల నిర్వహణ కష్టతరమైన బాధ్యత అని.. అన్ని విభాగాల్లోనూ క్రియాశీలక భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఎడిటర్ విధులు కీలకమని.. ఈ బాధ్యత కత్తి మీద సామేనన్నారు. ఆధునిక కాలంలో సోషల్ మీడియా విస్తరించిన క్రమంలో సమాజ శ్రేయస్సే పరమావధిగా ముందుకు సాగుతున్న పాత్రికేయులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. గెస్ట్ ఎడిటర్ రోల్ బాగా నచ్చిందని.. ఇది తనకు ప్రత్యేకమైన అనుభూతిని మిగిలిస్తోందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

చిన్ననాటి నుంచే తీర్చిదిద్దాలి..

విద్యార్థులు తమ కలలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలి. తమ మీద తమకు ఆత్మగౌరవం సన్నగిల్లకుండా నమ్మకాన్ని కలిగి ఉండాలి. పట్టుదల సడలనివ్వకుండా గోల్ సాధించాలని ఎస్పీ సూచించారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని.. ఇది మంచి పరిణామమన్నారు. అయితే ఇంటాబయట మహిళలపైనే పని భారం ఎక్కువగా ఉంటోందని.. ఈ మేరకు సమాజంలో మరింత మార్పు రావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ప్రతిఒక్కరూ చిన్న నాటి నుంచే లింగ భేదం లేకుండా తమ పిల్లలను తీర్చిదిద్దాలని.. తద్వారా సమాజంలో మార్పు వస్తుందని సూచించారు.

విద్య, ఆర్థిక స్వేచ్ఛతోనే మహిళా సాధికారత..

చట్టం, పోలీసువ్యవస్థపై మహిళల్లో విశ్వాసం పెరిగిందని, పోలీస్‌శాఖలో కొద్దికాలంగా మహిళల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఎస్పీ అన్నారు. మారుమూల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పోలీస్ శాఖ నియామకాల్లో చేరుతున్నారని వివరించారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోనూ మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. తన దృష్టిలో మహిళా సాధికారత అంటే మొదట విద్య, ఆర్థిక స్వాతంత్ర్యమని పునరుద్ఘాటించారు. అవి సాధించినప్పుడే మహిళా సాధికారతకు అడుగులు పడతాయన్నారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడినప్పుడు వారికి స్వాతంత్ర్యం వచ్చినట్లు అని.. అప్పుడే సమాజంలో మహిళలకు అన్నింటా గౌరవం, ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు.



సీటీపీ విభాగంలోని ప్రింటింగ్ ప్లేట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

గడువు పొడిగింపు

గద్వాల అర్బన్: టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణ దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడగించినట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈనెల 12వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 9,10వ తేదీల్లో కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 08546-293022 లేదా 9908560268 నంబర్లకు సంప్రదించాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేరుశనగ @ 6,550

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1,415 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6550, కనిష్టం రూ. 3296, సరాసరి రూ. 5600 ధరలు పలికాయి. 114 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5702, కనిష్టం రూ.5239, సరాసరి రూ.5689 ధరలు వచ్చాయి. 15 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 9586, కనిష్టం రూ. 9206 ధరలు పలికాయి.

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అలంపూర్



తన ఛాంబర్‌లో మహిళా అధికారులతో కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: అలంపూర్‌ను అంతర్జాతీయ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ప్రసాద్ స్కీం నిధులు వెచ్చిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. గురువారం ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించిన స్వదేశీ దర్శన్ భాగంగా అలంపూర్ ప్రసాద్‌స్కీం భవనాన్ని వర్చువల్ ద్వారా ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే ఐదో శక్తిపీఠంగా పిలవబడే అలంపూర్ జోగుళాంబ దేవాలయంతో పాటు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. మూడు ఎకరాల స్థలంలో అన్నదానసత్రం, అధునాతన వంటగది, ఓపెన్‌థియేటర్, వసతిభవనం, స్నానాల గదులు, దేవాలయం నుంచి పర్యాటక వసతి భవనం వరకు సీసీ రోడ్లు, వాహనాల పార్కింగ్, వంటి సౌకర్యాలను సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 90శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిపోయిన పనులను కూడ త్వరగా పూర్తిచేసి భక్తులకు, పర్యాటకులకు అందుబాటులో తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర టూరిజం అధికారి ప్రవీణ్‌కుమార్, సీఈ వెంకటరమణ, ఈవో పురేందర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని కలెక్టర్ అన్నారు. గురువారం ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మహిళా అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, మునిసి వెంకటేశ్వర్లు, మహిళా అధికారులు కాంతమ్మ, రేవతి, సరోజ, విమల, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.





'ఆకాశంలో సగం..అవకాశాల్లో సగం అంటూ అన్ని రంగాల్లో దూసుకెళు తున్న మహిళ అణచివేతకు గురవ్వ టం ఆందోళన కలిగిస్తోంది. వారి రక్షణ, భద్రతకు భరోసా లేకుండా పోయింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వేధింపులు, ఆకృత్యాలు, లైంగికదాడులు పెరిగాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్తారింటి వేధింపులు ఎక్కువ య్యాయి. కట్నం కోసం గొడవల్లో మహిళలు ఆత్మ హత్యలు చేసుకోవడం పెరిగిపోయింది.'

- మహబూబ్‌నగర్ క్రైం

ఆగని అఘాయిత్యాలు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు
- మహిళలపై అనుమానాలు, వరకట్న వేధింపులు
- క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు
- మహిళా పోలీస్ స్టేషన్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

రేపటికి ముందడుగు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న మహిళ పోలీస్‌స్టేషన్‌లో గతేడాది మొత్తం 1,175 ఫిర్యాదులు రాగా దీంట్లో 1,050 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో 118 కేసులు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో షీటీం పోలీసులకు 73ఫిర్యాదులు రాగా 17 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ ఏడాది మహబూబ్‌నగర్‌లో జనవరి నుంచి ఫిబ్రవరి వరకు అత్యాచారాలు 19, పోక్సో కేసులు 21, మహిళ వేధింపులు 22, ఈవ్ టీజింగ్ 2 కేసులు నమోదయ్యాయి.

మహిళలకు రక్షణ కరువు

ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా.. అధికారులు నిఘా పెంచుతున్నా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎన్నో చట్టాలు వచ్చినా మహిళలపై వరకట్న వేధింపులు, దాడులు, లైంగికదాడులు, గృహహింస ఆగడంలేదు. కామాంధుల చేతుల్లో మహిళలు, అభం శుభం తెలియని చిన్నారులు సైతం బలవుతున్న ఘటనలు నేడు అనేకం. ఇంటాబయట మహిళలకు నానాటికీ రక్షణ కొరవడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉండే మహిళలు, యువతులు, చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. పండంటి కాపురంలో కలతలు నెలకొనడంతో రోజూ పోలీసులను ఆశ్రయిస్తూ ఉన్న మహిళల సంఖ్య పెరుగుతోంది. వారంతా అత్తింటి నుంచి రక్షణ కోసం ఫిర్యాదు చేస్తున్నారు. చాలా మంది భార్యాభర్తలకు పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించి పంపిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో దారికి రాని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

ఘటనల పరిస్థితి

పాలమూరు పట్టణంతో పాటు జడ్చర్ల, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ వంటి పట్టణ కేంద్రాల్లో రోజు ఏదో ఒక చోట దాడులు జరుగుతున్నాయి. ప్రధానంగా మహిళలపై వివిధ రకాలుగా జరిగిన ఆకృత్యాలను పరిశీలిస్తే ప్రతి నెలా సగటున 3నుంచి 5చొప్పున కేసులు నమోదవుతున్నాయి. ఇవే కాకుండా పరువుపోతుందనే ఉద్దేశంతో బాధితులు బయటకు రాకపోవడం, మూడోవంతు ఘటనలు వెలుగులోకి రావడం లేదు. ఇలాంటి బాధిత కుటుంబీకులు మానసిక ఒత్తిడితో కుమిలిపోతున్నారు. బాధను భరించలేని మరికొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మహిళలపై దాడులు జరుగుతున్న ప్రాంతాలు, అత్యధికంగా ఫిర్యాదు వస్తున్న ప్రాంతం వీరన్న పేట అగ్రస్థానంలో ఉంది. ఈ ఏరియా నుంచి మహిళ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో పాటు రామయ్యబౌళి, షాషాబ్‌గుట్ట, పాత పాలమూరు, టీడీగుట్ట, మొండిగేరి, పాత తోట, ప్రేమ్‌నగర్, మోతీనగర్, ప్రేమ్‌నగర్ ఏరియాలో మహిళలపై అధికంగా దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. మరోవైపు తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండడం లేదు. తమ పిల్లలు గర్భం దాల్చితే కానీ గుర్తు పట్టని పరిస్థితుల్లో కొందరు పెద్దలు ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రధానంగా పిల్లలు రోజంతా సెల్‌ఫోన్లు వాడితే.. పెద్దలు తమ ఉద్యోగాలు, వ్యాపార జీవితాల్లో నిమగ్నమవుతున్నారు.

మహిళకు అండగా 498(ఏ) సెక్షన్

మహిళపై జరిగే దాడుల కోసం ప్రత్యేకంగా చట్టంలో 498(ఏ)ను పొందుపరిచారు. మహిళలపై భర్త, ఆయన తరపు కుటుంబ సభ్యులు క్రూరంగా, శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయడం, కొట్టడం, వరకట్నం కోసం వేధించడం, ఇతర రకాలకు మహిళను ఇబ్బందులకు గురి చేస్తే ఈ సెక్షన్ ఉపయోగిస్తారు.

- ⇨ లైంగిక వేధింపులు ఎదురైతే 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం నిందితులను అదుపులోకి తీసుకుంటారు.
- ⇨ మహిళలను అవమానించినా, అనుమతి లేకుండా ఫొటోలు తీసినా, అత్యాచారయత్నానికి పాల్పడినా సెక్షన్ 354 ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- ⇨ మహిళల విధులకు ఆటంకం కలిగిస్తే ఐపీసీ సెక్షన్ 509 కింద జైలు శిక్ష విధిస్తారు.
- ⇨ వ్యభిచార గృహాలకు తరలించడం, రవాణా చేయడం వంటివి చేస్తే 1986 చట్టం ప్రకారం శిక్షార్హులు.
- ⇨ సెల్‌ఫోన్ల ద్వారా ఇంటర్‌నెట్ ద్వారా అవమానపరచడం, అసభ్యకరంగా మాట్లాడడంలాంటివి చేస్తే సెక్షన్ 354డీబై2 ఐపీసీ చట్టం ప్రకారం శిక్షార్హులు.
- ⇨ లైంగికదాడికి గురైన సమయంలో సెక్షన్ 376ప్రకారం నేరం రుజువైతే కఠిన కారాగార శిక్షలు ఉంటాయి.
- ⇨ నిర్భయ చట్టం సెక్షన్ 354ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపడుతారు.
- ⇨ గృహహింస చట్టం 498డీపీ 3, 4 ద్వారా కేసు నమోదు చేస్తారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో 2023లో నమోదైన కేసులు		నారాయణపేట జిల్లాలో..		నాగర్‌కర్నూల్ జిల్లా 2023-24లో			వనపర్తి జిల్లాలో 2023-24లో..	
అత్యాచార కేసులు 97	పోక్సో కేసులు 113	అత్యాచార కేసులు 6	పోక్సో కేసులు 40	అత్యాచార కేసులు 77	పోక్సో కేసులు 2		అత్యాచార కేసులు 3	పోక్సో కేసులు 44
మహిళ వేధింపులు 132	ఈవ్ టీజింగ్ 4	గృహహింస కేసులు 50	మహిళ వేధింపులు 46	గృహహింస కేసులు 328	మహిళ వేధింపులు 12	ఈవ్ టీజింగ్ కేసులు 4	గృహహింస కేసులు 111	మహిళ వేధింపులు 33



మోటార్ వైండింగ్ చేస్తున్న చెన్నప్ప భార్య శారద



ఫ్యాన్ మోటార్ అల్లుతున్న రాము భార్య మహేశ్వరి

భర్తలకు చేదోడుగా భార్యలు

- మోటార్ వైండింగ్ పని చేస్తున్న మహిళలు

భర్తలకు అండగా వారి భార్యలు కూడా వారు చేసే పనిలో చేదోడుగా నిలుస్తున్నారు. పట్టణానికి చెందిన చెన్నప్ప, రాము ఇద్దరు అన్నదమ్ముళ్లు. వీరిద్దరికి వివాహం కాగా వీరు ఓ మోటార్ వైండింగ్ షాపును నిర్వహిస్తున్నారు. చెన్నప్ప భార్య శారద, రాము భార్య మహేశ్వరి కూడా ప్రతి రోజు వారు ఇంటి వద్ద ఉండే బదులుగా షాపులో ఉంటున్నారు. రోజురోజుకు పనిలో మార్పు రావడంతో వారి భార్యలు మోటార్ వైండింగ్, ఫ్యాన్లు, కరెంటు మోటార్ పనులు చేస్తున్నారు. అయితే భర్త లు అందుబాటులో లేకపోయినా షాపును వీరు నడిపిస్తున్నారు. ప్రతి రోజు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తుందని వారు తెలిపారు.


– మక్తల్

ఇక 'స్థానిక' పోరే..!

- కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి పోటీ
- తాజాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి సైతం ఖరారు
- బరిలో నిలవనున్న ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి
- అధికారికంగా ప్రకటించిన మాజీ సీఎం కేసీఆర్
- క్షేత్రస్థాయిలో యుద్ధానికి ఇరు పార్టీల సన్నాహాలు



మన్నె జీవన్‌రెడ్డి



ఎన్. నవీన్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి పేరును ఇది వరకే ప్రకటించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆయన పేరును ప్రకటిస్తూ.. గెలిపించాలని కోరారు. తాజాగా బీఆర్‌ఎస్ సైతం తమ అభ్యర్థిని ఖరారు చేసింది. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం మామిడికుంటకు చెందిన నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ తరపున బరిలో నిలవనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లో అధికారికంగా వెల్లడించారు. నవీన్ కుమార్ రెడ్డి గతంలో ఉమ్మడి పాలమూరు జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్‌ఎస్ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కేసీఆర్ నవీన్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది.

నామినేషన్లకు 4 రోజులే..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థలకు సంబంధించి బీజేపీకి తగిన ఓటు బ్యాంక్ లేకపోవడంతో ఈ ఎన్నికలకు దూరంగా ఉంటోంది. మిగిలిన ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు కాగా.. ఇక క్షేత్రస్థాయిలో పోరు ఊపందుకోనుంది. ఈ ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు సుమారు 1,450 మంది ఓటు వేయనున్నారు. వీరిలో అధికసంఖ్యలో బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. మారిన రాజకీయ పరిణామాలు ఎవరికి కలిసివస్తాయనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికలను కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. డబ్బులు ఏరులై పారుతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 11 కాగా.. ఆ లోగా వేసేలా మంచి ముహూర్తం కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 28న ఎన్నికలు జరగనుండగా.. వచ్చే నెల రెండో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ముఖ్య నేతలు ససేమిరా అనడంతోనేనా ?

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ నుంచి తొలుత దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పేరు వినిపించింది. అయితే అనూహ్యంగా నవీన్‌కుమార్ రెడ్డి పేరు తెరపైకి రావడం ఆ పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. 2016లో జిల్లాల పునర్విభజన అనంతరం షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఆ తర్వాత మహబూబ్‌నగర్ స్థానిక సంస్థలకు సంబంధించిన ఏ ఎన్నికల్లోనూ ఆ నియోజకవర్గ నేతలకు పోటీ చేసే అవకాశం రాలేదు. రెండు పర్యాయాలుగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధికి చెందినవారే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ సారి ఇరు పార్టీల అభ్యర్థులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధికి చెందిన వారు కావడం విశేషం. అయితే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలోని నందిగామ మండలానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డికి అవకాశం ఇవ్వడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రస్తుత మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లా పరిధిలోని ముఖ్యనేతలు పోటీకి ససేమిరా అనడంతో బీఆర్‌ఎస్ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ శ్రేణులు గుసగుసలాడుతున్నాయి.

పాహిమాం పరమేశ్వరా..

- మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- నల్లమలలో మార్మోగుతున్న శివనామస్మరణ



నల్లమలలోని ఉమామహేశ్వరాలయం

అచ్చంపేట/కొల్లాపూర్ రూరల్: మహాశివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్తున్న భక్తులతో నల్లమలలోని ప్రసిద్ధ ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. హరహర మహాదేవ శంభోశంకర.. ఓం నమఃశివాయ స్మరణతో మార్మోగుతున్నాయి. ఉమామహేశ్వర క్షేత్రం, మల్లెలతీర్థం, లొద్దిమల్లయ్య, సోమశిల సోమేశ్వరాలయం తదితర ప్రసిద్ధ ఆలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు..

శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వరం క్షేత్రంలో శుక్రవారం ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 7నుంచి రాత్రి 9గంటల వరకు నిత్యాభిషేకాలు, అర్చనాలు నిర్వహిస్తారు. రాత్రి 11గంటలకు లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి ఒంటిగంటకు పాపనాశం వరకు పల్లకీ సేవ, ఉమామహేశ్వర కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున నందివాహన సేవ, నీరాజన మంత్రం పుష్పాలు, సుప్రభాత సేవ, 7గంటలకు నిత్యాభిషేకం, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తేజో లింగరూపంలో దర్శనం..

మహాశివరాత్రి నాడు పరమశివుడు విష్ణు, బ్రహ్మకు తేజో లింగరూపంలో దర్శనమిచ్చాడని లింగ, కూర్మ, శివ పురాణాల్లో ఉంది. మహాశివరాత్రి గురించి మరో అంశం కూడా ఉంది. దేవతలు, రాక్షసులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మదిస్తున్నప్పుడు వచ్చిన గరళాన్ని పరమశివుడు మింగి, సకల లోకాలకు శుభాన్ని కలిగించిన మాఘ బహుళ చతుర్దశి రోజు మహాశివరాత్రి పర్వదినం ఆచరిస్తున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. శివుడికి ప్రీతిపదమైన మహాశివరాత్రి రోజు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లింగోద్భవకాల అభిషేకాలు మహాద్భుతంగా నిర్వహిస్తారు.



ఉమామహేశ్వరుడు

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



మహిళా ఓటర్లతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని.. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ మైదానంలో మహిళా ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 83 శాతం పోలింగ్ నమోదై, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే, గత పార్లమెంట్ ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదు కాలేదని.. ఈ ఎన్నికల్లో 83 శాతానికి పోలింగ్ చేరుకునేలా కృషిచేయాలని మహిళా సంఘాల సభ్యులను కోరారు. 84 శాతం మహిళా ఓట్లు పోల్ కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఏ కార్యక్రమం విజయవంతం కావాలన్నా మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీల్లో శ్వేతకు మొదటి, రేవతి ద్వితీయ, సల్మా తృతీయ బహుమతులు సాధించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. స్వీప్ రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి భవానీ శంకర్, జిల్లా నోడల్ అధికారి చిన్న ఓబులేషు, ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, మున్సిపల్ కమిషనర్ నరేష్, మెప్మా మేనేజర్ శ్వేత, డీపీఎం అరుణదేవి పాల్గొన్నారు.

మహిళలు మరింత పురోగతి సాధించాలి

మహిళలు మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత శాతం రాష్ట్ర స్థాయిలో చివరి నుంచి రెండో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. నిరక్షరాస్య మహిళలను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యతను మహిళా సంఘాలు తీసుకోవాలన్నారు. అందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వేసవిలో పాఠశాల విద్యార్థులచే నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓలను సన్మానించారు. డీడబ్ల్యూఓ రాజేశ్వరి, సఖి కోఆర్డినేటర్ సునీత, డీహెచ్‌డబ్ల్యూ కోఆర్డినేటర్ శ్వేత పాల్గొన్నారు.











సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE

- MVR రియాల్టీ గ్రూప్ మహబూబ్‌నగర్‌లో మన్యంకొండకు ఆనుకొని బెంగుళూరు రోడ్డుకు దగ్గరలో సెవెన్‌హిల్స్ శాండల్ వుడ్ ఫామ్ ల్యాండ్ అమ్మబడును.సంప్ర॥ సెల్: 9391745197, 9440299999

PLOT FOR SALE

- 101 Acres Project HMDA & DTCP Approved premium villa Plots Rs. 8499/- to 18,000/- on Sri Shailam & Sagar H/W facing. Ph: 9900043444

SERVICES

BUSINESS OFFER

- మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222.

WANTED

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 89197 39694.
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 9059683584.
- Raymands Cloth Show Room జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఇంఛార్జ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్ కావలెను. సెల్ : 9492801999.
- నర్మద హోండా షోరూం మహబూబ్‌నగర్, వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జ్, మెకానిక్‌లు కావలెను. సెల్ : 9493159185.

సాక్షి భవిత విద్యార్థుల కోసం



గమనిక

పొత్తుపై నేడు స్పష్టత!

- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తుల వ్యవహారంలో శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో అమిత్ షా నివాసంలో టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. పొత్తులు, సీట్ల సర్దుబాటుపై వీరు చర్చించినట్లు సమాచారం. తమకు 8–10 లోక్‌సభ స్థానాలు, 15–20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే చెబుతామని బీజేపీ పెద్దలు కరాఖండిగా చెప్పారని తెలిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై శుక్రవారం ఒక స్పష్టత రానుండగా.. సీట్ల సర్దుబాటు విషయంలో బీజేపీ పెద్దలతో జరిగిన భేటీకి సంబంధించి ఏ క్షణానైనా ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటికి వెళ్లిపోయిన తర్వాత విశాఖపట్నం, రాజంపేట. రాజమండ్రి, హిందూపురం, తిరుపతి, అరకు, విజయవాడ వంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై తాము ఏ విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్న అంశాన్ని బీజేపీ పెద్దలు చర్చల సందర్భంగా తెరపైకి తెచ్చారు. అందువల్ల తామడిగిన లోక్‌సభ స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌లకు స్పష్టం చేశారని తెలిసింది.

‘చేయూత’ పండుగ

- మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో ఏపీ సీఎం జగన్
- వైఎస్సార్ చేయూతతో 2,698,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్లు సాయం
- 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో ‘చేయూత’ కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మనందరి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళా దినోత్సవం ముందు రోజు ‘వైఎస్సార్ చేయూత’ ద్వారా ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మహిళా సాధికారత పట్ల ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. 45 – 60 ఏళ్ల వయసున్న మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయం అందించే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనకాపల్లి జిల్లాలోనే నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సాయంతో ఎదిగిన మహిళలంతా తమ విజయగాథలను వివరిస్తూ రానున్న 14 రోజుల పాటు సచివాలయాలవారీగా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు – దత్తపుత్రుడు గతంలో మేనిఫెస్టోలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. వారి పేరు చెబితే ఎనిమిది రకాల మోసాలు, దగా గుర్తురాగా మన ప్రభుత్వం పేరు చెబితే సంక్షేమం గుర్తుకొస్తుందన్నారు. చంద్రబాబును చూస్తే విశ్వసనీయతలేమి గుర్తుకొస్తుందని, దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కార్లను మార్చినట్లు భార్యలను మార్చే వ్యవహారం



అనకాపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

గుర్తుకొస్తుందని విమర్శించారు. వారిని నమ్మితే కాటేసే పామును నమ్మినట్టేనని, తినేసే పులిని ఇంటికి తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపైనర్లుగా నిలిచి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో సీఎం జగన్ ప్రారంభించారు.

4 రోజుల్లో 850 ఎకరాలా!

▶ మొదటి పేజీ తరువాయి

ఐఎంజీ భారత్‌తో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. క్రీడల్లో రాష్ట్ర యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దడం కోసం అంటూ ఈ ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అకాడమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసం అంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలు అప్పగించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ఐఎంజీ భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2004, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలో ఎంతో విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే కేవలం రూ.2 కోట్లకే ఐఎంజీ భారత్‌కు అప్పగించింది (సేల్ డీడ్ చేసింది). అయితే 2006లో ప్రభుత్వ ఆస్తులను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్ట ప్రకారం ఐఎంజీ భారత్‌తో అంతకుముందు ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూ, ఆ మేరకు సేల్‌డీడ్ కూడా రద్దయ్యాయి. ఈ క్రమంలో 2007 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం సంబంధిత లావాదేవీలు రద్దు చేయడమే కాకుండా ఐఎంజీ చెల్లించిన మొత్తాన్ని ఏడాదికి 12 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ప్రభుత్వ చట్టాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పూర్తి కేబినెట్ ఆమోదం లేదు: ఏజీ

‘పూర్తి కేబినెట్ ఆమోదం లేకుండా నాటి ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలు చేసింది. ఆ సమయంలో భూమి విలువ ఎకరం రూ.13 లక్షలు ఉండగా, పిటిషనర్‌కు రూ.50 వేల స్వల్ప మొత్తానికే సరైన ఎలాంటి కారణం లేకుండా విక్రయించారు. ఐఎంజీ భారత్‌కు అమెరికన్ కంపెనీ అయిన ఐఎంజీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ దానికి అనుబంధ సంస్థ అంటూ మోసగించారు. అందుకే తదుపరి ప్రభుత్వం ఎంవోయూను రద్దు చేసింది. పరిహారం ఇవ్వాలని కూడా నిర్ణయించింది. 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఒక్క ఐఎంజీ కోసమే కాదు. ఇది ఇతర భూ లావాదేవీలకు కూడా వర్తిస్తుంది. ఇలా చట్టం తీసుకొచ్చే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం శాసనసభకు ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత 2007లో చేసిన చట్టం అమల్లోకి వచ్చింది..’అంటూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ..‘ ఒక ఐఎంజీ భారత్ కోసమే చట్టాన్ని తేవడం సమర్థనీయం కాదు. ఎంవోయూ ను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు..’అంటూ వాదించారు.

ఎలాంటి విచారణ చేయకుండానే ఆమోదం: ధర్మాసనం

‘2003 ఆగస్టు 5న ఐఎంజీ భారత్ ఏర్పాటైన తర్వాతి రోజే, ఎలాంటి విచారణ చేసుకోకుండానే 6న నాటి యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ కంపెనీకి ఆమోదం తెలుపుతూ సర్క్యులర్ జారీ చేసింది. అదే రోజు నలుగురు మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి ఆగమేఘాలపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత 9వ తేదీన ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్పోర్ట్స్ అకాడమీ, స్టేడియాల నిర్వహణకయ్యే ఖర్చు ఏడాదికి రూ.2.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి మూడేళ్లపాటు విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ బిల్లులనూ 100 శాతం తిరిగి చెల్లిస్తామని చెప్పా రు. ఆ తర్వాత క్రమంగా దీన్ని తగ్గిస్తామని తెలిపారు. ముఖ్యంగా పిటిషనర్‌కు అంతర్జాతీయ క్రీడా సంస్థ (ఐఎంజీ, అమెరికా)తో సంబంధం గానీ, గతంలో క్రీడా రంగంలో అనుభవం గానీ లేవు. ఉన్నట్లుగా పిటిషనర్ ఐఎంజీ ఎలాంటి పత్రాలను ప్రభుత్వానికి సమర్పించలేదు.

ప్రభుత్వం రద్దయ్యాక 400 ఎకరాలకు సేల్‌డీడ్!

2003, నవంబర్ 14నే చంద్రబాబు ప్రభుత్వం రద్దయ్యింది. తర్వాత ఆపద్ధర్మ ప్రభుత్వంగా మాత్రమే కొనసాగింది. ఈ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలోనే 400 ఎకరాలను నామమాత్రపు ధరకు ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తూ సేల్‌డీడ్ చేసింది. అయితే 2007లో భూములపై రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలతోనే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సరైన కారణాలు ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రభుత్వానికి ఈ అధికారం కల్పించింది. జాగ్రత్తగా గమనిస్తే.. కంపెనీ ఏర్పాటైన కేవలం 4 రోజుల్లోనే వేల కోట్ల విలువచేసే వందల ఎకరాల భూములు అప్పగించారు. మరే ఇతర కంపెనీకి రాష్ట్రంలో అంత స్వల్ప సమయంలో ఇలా భూములు ధారాదత్తం చేయలేదు. పిటిషనర్‌కు పరిహారం కోరే హక్కు ఉంది. అయితే 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని తన ఒక్క కంపెనీ కోసమే అంటూ సవాల్ చేయలేరు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకే వైఎస్ సర్కార్ చట్టం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ప్రభుత్వం ఉల్లంఘించిందన్న వాదన కూడా సరికాదు. ప్రజల ఆస్తులను కాపాడటం కోసమే 2007లో వైఎస్ సర్కార్ చట్టం తీసుకొచ్చింది. అది ఎవరి వ్యక్తిగత అవసరాల కోసం కాదన్న విషయం గ్రహించాలి. కంపెనీ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల్లో వేల కోట్ల భూములు గతంలో మరే ఇతర కంపెనీకి ప్రభుత్వం కేటాయించినట్లుగా ఐఎంజీ నిరూపించలేకపోయింది. అలాగే ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటును అడ్డుకునేందుకు ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు కూడా జరగలేదు. సేల్ డీడ్‌ను రద్దు చేయకూడదనే వాదన ఆమోదానికి అర్హమైనది కాదు. ఎంఓయూనే రద్దయినప్పుడు సేల్‌డీడ్ అమల్లో ఉండటం సాధ్యం కాదు..’అంటూ ధర్మాసనం తన తీర్పులో వ్యాఖ్యానించింది.

సీబీఐ విచారణకు లేఖ రాశామన్నారుగా..

‘ఐఎంజీ భారత్‌కు భూముల అప్పగింతపై సీబీఐ విచారణ కోరుతూ గతంలో లేఖ రాశాం అన్నారు.. ఎంత వరకు వచ్చింది? మీరు విచారణ కోరతారా? లేక మమ్మల్నే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు ఇవ్వమంటారా?’అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా ఏదో ఒకటి చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వారం పాటు వాయిదా వేసింది. ఐఎంజీ భారత్‌కు భూముల కేటాయింపు, ఎంవోయూ, సేల్ డీడ్.. ఇలా అన్ని అంశాలపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)తో విచారణ జరిపించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతో పాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ఒప్పందం వెనుక పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లను గురువారం మరోసారి సీజే ధర్మాసనం విచారించింది. సీబీఐకి అప్పగించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ అభిప్రాయం ధర్మాసనం కోరింది. ఆయన తమకు కొంత సమయం కావాలనడాన్ని, ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాత తెలియజేస్తాననడాన్ని తప్పుబట్టింది. ఇంకా ఎంతకాలం ఆగాలని, వారంలోగా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. కాగా గతంలో ఇదే పిల్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కోరితే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి సీబీఐ తెలియజేయడం గమనార్హం.

10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ:వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై తొలి విడత కసరత్తును ఏఐసీసీ అగ్ర నాయకత్వం పూర్తి చేసింది. తెలంగాణలోని సుమారు పది స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసింది. ప్రాంతీయ, కుల సమీకరణలు, రాజకీయ నేపథ్యం, సర్వేల్లో విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. అభ్యర్థుల ప్రకటన ఏక్షణమైనా వెలువడవచ్చని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లిలో గడ్డం వంశీ, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి, నిజామాబాద్‌లో టి.జీవన్‌రెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్, చేవెళ్లలో సునీత మహేందర్‌రెడ్డి, నల్లగొండలో రఘువీర్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డిల పోటీకి ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేక పోవడంతో వారి అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపినట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానానికి సురేశ్ షెట్కార్, ఉజ్వల్‌రెడ్డిల పేర్లను పరిశీలించినట్లు సమాచారం.

కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు గురువారం సాయంత్రం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఏఐసీసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పరిశీలనలోకి వచ్చిన అభ్యర్థుల వివరాలు, స్క్రూటినీ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సీఈసీ ముందుంచారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివేదికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. మొదటగా సింగిల్ పేర్లతో కూడిన స్థానాలను కమిటీ పరిశీలించింది. మొత్తంగా 8–10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు.

మరిన్ని స్థానాలపై చర్చ

మిగతా స్థానాలపై కూడా చర్చించినా, మరోమారు సమావేశమై సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేద్దామనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో ఇటీవలే పార్టీలో చేరిన బొంతు రామ్మోహన్ దంపతులు, నాగర్‌కర్నూల్‌లో మల్లురవి, సంపత్ కుమార్, వరంగల్‌లో దొరా సాంబయ్య సహా మరో పేరు, మల్కాజిగిరిలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, ఆదిలాబాద్‌లో ఆదివాసీలైన ఇద్దరి పేర్లపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఆయా స్థానాలపై వచ్చే వారంలో తుది నిర్ణయం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు.

ఇక్కడి నుంచి రాహుల్ పోటీ లేనట్టే!

తెలంగాణలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీకి దింపాలన్న రాష్ట్ర నేతల వినతిని ఏఐసీసీ తిరస్కరించినట్లు తెలిసింది.

జాతీయస్థాయి రేస్ వాకింగ్ జడ్జిగా గద్వాల జిల్లా వాసి



సయ్యద్ హైదర్ పాషా

ఎర్రవల్లిచౌరస్తా: జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ హైదర్ పాష జాతీయ స్థాయి రేస్ వాకింగ్‌లో జడ్జిగా ఎంపికయ్యారు. జనవరి 29 నుంచి 31 వరకు చండీఘర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి విడుదలైన ఫలితాలలో జాతీయ స్థాయిలో 7వ ర్యాంకును సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్‌లో జడ్జిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన బీచుపల్లి పదవ పటాలంలోని సాయిధ చైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అథ్లెటిక్ అసోషియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు అతనిని అభినందించారు.

10న పీయూలో జాతీయస్థాయి సెమినార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 10న రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ప్రకటనలో తెలిపారు. లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

10న ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అర్హత పరీక్ష నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు సూచించారు.

తొలిసారి తెలుగులో కోర్టు తీర్పు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజలకు అర్థమయ్యేలా తెలుగులో కోర్టు తీర్పులు వెలువరించాలన్న ఉద్దేశంతో తొలిసారిగా నాగర్‌కర్నూల్ స్పెషల్ మొబైల్ కోర్టు పరిధిలో ఓ కేసుకు బుధవారం తెలుగులో తీర్పును వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో మూడేళ్ల క్రితం నమోదైన పేకాట కేసును విచారించి సాక్షాధారాలు బలంగాలేని కారణంగా నాగర్‌కర్నూల్ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ మమతా రెడ్డి తీర్పును తెలుగులో వెలువరించారు.

ఘనంగా ధ్వజారోహణ

- 4వ రోజుకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం 4వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో గురువారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తారని ఉత్సవ కార్యక్రమాల ఆచార్యులు విద్యావాచస్పతి బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాస్ శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ముక్కోటి దేవతలను రుత్వికులు మంత్ర పూర్వకంగాను, వాయిద్యకారులు రాగతాళాలతో ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. అంతకుముందు ఉభయ ఆలయాలలో ఉత్సవ బలిభేరితో అష్టదిక్పాలక బలిహరణలు సమర్పించారు.

నేడు మహాకుంభాభిషేకం..

మహాశివరాత్రి శుక్రవారం రోజున మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురంధర్ కుమార్ తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అన్నారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటలవరకు కలాన్యాసం, అనంతరం ఆలయ దర్శనం, భక్తులకు అభిషేకాది కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు మహాకుంభాభిషేకానికి సంబంధించి పూర్ణాహుతి, 9:30 నుంచి 10:30 వరకు మహాకుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. భక్తులకు యధాతథంగా స్వామివారి గర్భాలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు రుద్రనమక చమకాలతో అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.




మహాకుంభాన్ని అమ్మవారి ముందుంచి పూజలు చేస్తున్న అర్చకులు



మహాకుంభాన్ని తీసుకొస్తున్న అర్చకులు, ఈఓ, చైర్మన్

మహబూబ్‌నగర్ రీజియన్‌కు రెండోస్థానం



మంత్రి, ఎండీ చేతులమీదుగా పురస్కారం, నగదు బహుమతి అందుకుంటున్న ఆర్ఎం శ్రీదేవి

- అవార్డు అందుకున్న ఆర్టీసీ ఆర్ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో భాగంగా గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉత్తమ ఫలితాలు సాధించిన రీజియన్‌లకు గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో పురస్కారాలు అందజేశారు. మహబూబ్‌నగర్ రీజియన్ రెండో ఉత్తమ రీజియన్‌గా ఎంపికకాగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ చేతులమీదుగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి పురస్కారంతోపాటు రూ.75వేల నగదు బహుమతి అందుకున్నారు. అదేవిధంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శ్యామల, బాబునాయక్, రీజియన్‌లోని డిపో మేనేజర్లు సుజాత (మహబూబ్‌నగర్), లక్ష్మీసుధ (నారాయణపేట), ప్రసాద్ (అచ్చంపేట), ఉమాశంకర్ (కొల్లాపూర్), శ్రీకాంత్ (కల్వకుర్తి), దేవరాజ్ (నాగర్‌కర్నూల్), వేణుగోపాల్ (వనపర్తి), మంజుల (గద్వాల), ఉషా (షాద్‌నగర్) ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజాపూర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల శివారులో జాతీయరహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజాపూర్ శివారులో ఉన్న బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గమనించిన రాజాపూర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్ నాయక్, కారోబార్ రాములు విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. స్థానిక బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, కడల ఆంజనేయులు మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. మృతుడి ఒంటిపై ఖాకీకలర్ ప్యాంట్, గోధుమరంగు షర్టు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

4వ రోజు రెండవ సెట్ నామినేషన్ మాత్రమే

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ శాసన మండలి ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నామినేషన్ల స్వీకరణ గురువారం రెండవ సెట్ మాత్రమే దాఖలైంది. ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి ఎంపీటీసీ మంగీ విజయ్ గురువారం రెండవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు ఉండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు ముహూర్తం చూసుకుని నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

క్షేత్రాల దర్శనంతో పుణ్యఫలం



ఉండవెల్లి: దేశంలోని పుణ్యక్షేత్రాలను దర్శించడంతో మనశ్శాంతి కలుగుతుందని.. దేవదాసు త్యాగీజీ మహరాజ్ బృందం తెలిపింది. గురువారం మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప ఆలయంలో బృందం సేదతీరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను పాదయాత్రగా దర్శించుకొని వాటి ప్రత్యేకలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అలంపూర్ క్షేత్రాన్ని కూడా దర్శించామని, ఇక్కడి నుంచి రాయచూర్ మీదుగా కర్ణాటకలోని పుణ్యక్షేత్రాలను అటునుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని చిత్రగుప్త పర్వతాలు దర్శించుకొని మధ్యప్రదేశ్‌కు వెళ్లనున్నట్లు చెప్పారు. సేద తీరుతున్న సమయంలో భజనలు చేస్తున్నామని పేర్కొన్నారు.

మూడు నెలలకే అహంకారమా?

- ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపాలి
- సీఎం, మంత్రులపై డీకే అరుణ ఆగ్రహం



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: గతంలో కేసీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడినందుకే ప్రజలు ఫాంహౌస్‌కు పరిమితం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడవకముందే అప్పుడే అహంకారం వచ్చిందా? అంటూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మొదట కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేసి చూపాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అంటూ తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చింది మీకు గుర్తు లేదా? 60ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారో మొదట చెప్పాలన్నారు. మోదీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే మైలేజీ వస్తుందని అనుకుంటున్నారెమో, రేవంత్‌రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడితే వెంటపడి తరిమేస్తామన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో నేను పోరాటం చేసి జీఓ తీసుకురాకపోతే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఉండేది కాదన్నారు. దమ్ముంటే కాళేశ్వరంపై ఇప్పటి వరకు సీబీఐతో ఎందుకు విచారణ చేయలేదని, కేసీఆర్‌తో కుమ్మకు అయ్యారంటూ విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఖచ్చితంగా 12 ఎంపీ స్థానాలు గెలుస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, కొండయ్య, సత్యం, కృష్ణవర్ధన్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, నారాయణయాదవ్, లక్ష్మీదేవి, జయశ్రీ పాల్గొన్నారు.

బీసీలకే బీజేపీ ఎంపీ సీటు కేటాయించాలి

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బీసీని ప్రకటించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ అభ్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రకటించారని, మిగిలిన బీజేపీ తమ అభ్యర్థిగా బీసీ నాయకుడు అయిన శాంతికుమార్‌కు సీటు కేటాయించాలని కోరారు. ఎంపీ అభ్యర్థులకు రెడ్లను ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ సారి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. 65శాతం ఉన్న బీసీ జనాభాను ఈ రెండు పార్టీలు విస్మరించాయని, ఎన్నికల్లో ఆ పార్టీలకు తగిన బుద్ధిచెబుతామన్నారు. బీజేపీ ఇంత వరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో తమ ఎంపీ అభ్యర్థులుగా బీసీ వాళ్లకు అవకాశం ఇవ్వలేదన్నారు. బీసీలను విస్మరించి ఓటేసే యంత్రాలుగా వాడుకుంటున్న పార్టీలకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సవారి సత్యం, ఆశన్న ముదిరాజ్, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థి

- దొరికిన రూ.50వేలు తిరిగి అప్పగింత



బాధితుడికి డబ్బులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థి

మద్దూరు: ప్రయాణికుడి డబ్బులు బస్సులో డబ్బులు పోగొట్టుకున్నాడు. అవి ఓ విద్యార్థికి దొరకగా విషయం ఉపాధ్యాయులకు తెలిపాడు. వ్యక్తి ఆచూకీ కనుక్కొని డబ్బులు అప్పగించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని వివిధ కాంట్రాక్టు పనులు చేసే పుల్లారెడ్డి గురువారం ఉదయం నారాయణపేట నుంచి బస్సులో మద్దూరు వస్తున్నారు. ఈ క్రమంలో దామరగిద్ద మండలం దేశాయిపల్లి స్టేజీ దగ్గర మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదివే విద్యార్థి వెంకటేష్ బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో మద్దూరు హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద బస్సు ఆపి పుల్లారెడ్డి దిగాడు. ఈ క్రమంలో ప్యాంటు జేబులోంచి రూ.50 వేలు నగదు పడిపోయాడు. ఇది గమనించకుండా దిగాడు. డబ్బులను మరో విద్యార్థి తీసుకుని దాచుకున్నాడు. ఈ విషయం గమనించి విద్యార్థి వెంకటేష్ విషయం మొత్తం ఉపాధ్యాయులకు తెలియజేయడంతో డబ్బులు తీసుకొని పెట్రోల్ బంకులో వాకబు చేసి పిలిపించి డబ్బులు అందజేశారు. విద్యార్థి నిజాయితీని పలువురు అభినందించారు.